మహబూబ్‌నగర్ నాగర్‌కర్నూల్ జోగులాంబగద్వాల్ నారాయణపేట వనపర్తి
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి
మంగళవారం 30 ఏప్రిల్ 2024 పేజీలు 8

# లోక్‌సభ ఎన్నికల బరిలో 31 మంది అభ్యర్థులు

- నామినేషన్లు ఉపసంహరించుకున్న నలుగురు
- జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్





**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరగబోయే ఎన్నికలలో మొత్తం 31 మంది అభ్యర్థులు రంగంలో దిగారు. మొత్తం 35 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా విత్‌డ్రా సమయంలో ఇండిపెండెంట్‌లు అయిన మహ్మద్ ఇంతియాజ్, మహ్మద్ అబ్దుల్ రహీమ్, శ్రీకాంత్, జంగయ్యలు విత్‌డ్రా చేసుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నలుగురు పోగా మొత్తం 31 మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థుల సమక్షంలో గుర్తులను కేటాయిస్తామని ఆయన తెలిపారు. అభ్యర్థులకు సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో కేటాయింపు జరుగును.

## ఆగస్టు 15 నాటికి

# పూర్తిగా రుణమాఫీ

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హన్వాడ మండలం పెద్దదర్పల్లి గ్రామంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటి ప్రచారం లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేసింది అని ఆయన గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని, ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి అమలు చేస్తున్నాం అని,ఎన్నికల కోడ్ వల్లనే కొన్ని సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన స్పష్టం చేశారు. మోడి గత పది సంవత్సరాలుగా మనకు ఏమి చేయలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా చిల్లిగవ్వ నిధులు మంజూరు చేయలేదని , గుజరాత్ రాష్ట్రంలో అభివృద్ధి చేశారు అని, అలాగే కేసీఆర్ కి రాజకీయ బిక్ష పెట్టినప్పటిన మహబూబ్ నగర్‌కు ద్రోహం చేసి అభివృద్ధి అంతా కేసిఆర్ స్వంత జిల్లా మెదక్ కు వేలకోట్ల రూపాయలు తరలించారు అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేదలు బడుగు బలహీన వర్గాలకు, ఎస్సీ ఎస్టీల కోసం రిజర్వేషన్లు అందిస్తే, ఇప్పుడు మోడి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని అంటున్నారు మీరు ఆలోచన చేయాలని

# విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్





**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర అతి కీలకమైనదని, తమ విధులను సమర్థవంతంగా పూర్తి బాధ్యతతో నిర్వహించాలని, ఈవిఎం లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లచే సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్టోరల్ అధికారుల బాధ్యతలు చాలా కీలకమని నిబద్ధతతో సమర్థవంతంగా విధులను నిర్వహించాలని సూచించారు. సెక్టోరల్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు, ఈవీఎం, వి వి ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన, హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకొని ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులునిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజున తగు సూచనలు అందించాలని తెలిపారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు, ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే శిక్షకులచే నివృత్తి చేసుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు కృషి చేయాలని తెలిపారు. ?ఎన్నికల పట్ల ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యంగా ఉండరాదని, ఏమైనా తప్పులు జరిగితే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ పూర్తి అయ్యే వరకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తల పట్ల మాక్ పోల్, ఈవీఎం, వివి ప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వి వి ప్యాట్లపై మాక్ పోల్ నిర్వహించే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింగరావు, ఆర్డిఓ రామచందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల నడ్డి విరుస్తున్న బీజేపీని ఓడిద్దాం

- కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ... అభివృద్ధిని మరిచిన కేంద్ర ప్రభుత్వం
- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అధిక మెజారిటీతో గెలిపిద్దాం
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** దేశంలో, రాష్ట్రంలో, నియోజకవర్గ స్థాయిలోను అభివృద్ధి పనులను గాలికి వదిలేసిన బిజెపి పార్టీ నేడు అక్షింతలు, రాముడు అంటూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని బిజెపి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన సిపిఎం నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రస్థాయి నియోజకవర్గ స్థాయిలోనూ కార్పొరేట్ వ్యవస్థను పటిష్టపరుస్తూ నిరుపేదల నడ్డి విరుస్తోందని ఆయన విమర్శించారు . కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ నిరుపేదల అకౌంట్ లలో డబ్బులు జమ చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నో హామీలు ప్రకటించిన నేటికీ ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని అదేవిధంగా పార్లమెంటులోనూ తెలంగాణ రాష్ట్ర నుంచి ఎంపీ అభ్యర్థిగా మల్లు రవి ఉంటే ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి, ఎంపీ కూడా మనమే ఉండటం వల్ల గ్రామస్థాయిలోను నిరాటంకంగా కొనసాగుతుందని ఆయన అన్నారు. మరో 13రోజుల్లో ఎంపీ ఎన్నికలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ 13 రోజులు కష్టపడి నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన డాక్టర్ మల్లు రవి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, వనపర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కాంగ్రెస్, సీపీఎం పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# ఈవీఎంల పంపిణీ గోడౌన్, భద్రతను పరిశీలించిన పోలీస్ అబ్జర్వ్ డిఐజి కాలు రామ్ రావత్

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లాకు పోలీస్ అబ్జర్వ్ వచ్చిన డిఐజి. కాలు రామ్ రావత్ , జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ లు సింగారం శివారులో ఉన్న శ్రీ దత్త బృందావనం బీఈడీ కళాశాలలో నారాయణపేట కాన్స్టెన్సీ కి సంబంధించిన ఈవీఎం లు భద్రపరిచిన గోడౌన్ ను, కౌంటింగ్ హాల్, ఈవీఎం లు పంపిణీ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లును మొదలగు వాటి గురించి ఎస్పీ ని అడిగి తెలుసుకుని ఈవీఎం గోడౌన్ దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే ఎన్నికలను ప్రభావితం చేసే ఏలాంటి అనుమానాస్పద అంశం తమ దృష్టికి వచ్చిన క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని మరియు ఎన్నికల ప్రభావిత అంశాలపైనే దృష్టి పెట్టాలని అలాగే ఎన్నికలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు లింగయ్య, మహేష్, నారాయణపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధు మోహన్, సీఐ లు శివ శంకర్, రామ్ లాల్, ఐటీబీపీ భూపాల్ సింగ్, తాసిల్దారు రాణా ప్రతాప్ మొదలగు వారు ఉన్నారు

## కల్వకుర్తిలో బిజెపి ప్రచారం



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి పట్టణంలోని గాందీ నగర్ 22 వ వార్డులో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, అదేవిధంగా 12వ వార్డులో కౌన్సిలర్ నీరుకంటి మంజుల రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ బీజేపీ ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని కావాలని దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రజలకు వివరించారు, అయోధ్యలో రామాలయం కడతామని గత ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్న నరేంద్ర మోడీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు, దేశంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న ఘనత నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు, నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్ ప్రసాద్ కు ఓటు వేయాలని ప్రచారం చేశారు, కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు బోడ నరసింహ. నరేష్ గౌడ్ , శ్రీకాంత్. కిరణ్, శివరామకృష్ణ. చింటూ కౌశిక్,. శివ. బాలకృష్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉప కేంద్రంలో సామాగ్రి చోరీ : కేసు నమోదు

**పానగల్ (మేజర్‌న్యూస్):** మండలకేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు పానగల్ ఎస్సై వేణు సోమవారం తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం వెనుక భాగంలో ఉన్న వ్యవసాయానికి సంబంధించిన కండక్టర్ వైరు, మెయిల్ ఫిమేల్ గడ్డలు అపహరించుకు వెళ్లారని ఆయన తెలిపారు. చోరీకి గురైన విద్యుత్ సామాగ్రి విలువ దాదాపు రూ. లక్ష ఉంటుందని, పానగల్ మండల విద్యుత్తు ఏఈ చందన్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేణు తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన పోమాల మాజీ ఎంపీటీసీ కమల



**నవాబ్‌పేట మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పోమాల మాజీ ఎంపీటీసీ కమల,పుట్టోని పల్లి తాండా బీఆరెస్ నాయకులు ఇరవై మందికి పైగా కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలోకి కాంగ్రెసు పార్టీ నాయకులు దుశ్యంత్ రెడ్డి పార్టీ లోకి ఆహ్వానించి కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు తాండా ప్రజల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఉన్న కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నవాజ్ రెడ్డి పోమాల లింగం అమ్మాపూర్ నర్సింహులు రవిందర్ రెడ్డి రమేష్ తాండా నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలను కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి



**గోపాలపేట మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి కాంగ్రెస్ కార్యకర్తలు తో సమావేశమై ఎన్నికల సరళి విచారించారు అనంతరం వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొంకి వెంకటేష్ ఇంట్లో భోజనం చేశారు అంతకుముందుకు రేవల్లి మండలంలో ఇంటింట ప్రచారం చేశారు ఈ కార్యక్రమంలో గోపాలపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గణేష్ గౌడ్ ఉపాధ్యక్షులు సుధాకర్ రావు బీసీ సెల్ అధ్యక్షులు దేవరాజు యాదవ్ రేవల్లి మండల శేషు హెూటల్ శీను మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మండల సోషల్ మీడియాకోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు

## డ్రగ్ ఫ్రీ జిల్లాగా వనపర్తి
## - అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్

**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** లైన్ డిపార్ట్మెంట్ లు అన్ని సమన్వయంతో పని చేస్తూ వనపర్తి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుదామని అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్ సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఐ .డి. ఒ.సి.లోని కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న నియంత్రణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయాల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాల పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయ విస్తీర్ణాధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఆబ్కారీ, పోలీస్ శాఖ వారు గట్టి నిఘా పెట్టాలని, మెడికల్ షాపులో నిషేధిత మందుల అమ్మకం జరగకుండా వైద్య శాఖ పర్యవేక్షణ చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, ఆర్డీఓ పద్మావతి, వైద్య అధికారి జయచంద్ర మోహన్, విద్యా శాఖ తరపున విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు

## వైభవంగా రామా అపదుద్ధారక హెూమం



**లింగాల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన లింగాలలోని ఎంతో ప్రసస్తి కలిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భాగంగా సోమవారం ఆలయంలో వైభవంగా రామ ఆపదుద్ధారక హెూమం జరిగింది. వేద పండితులు రామాచార్యులు సుదర్శన చార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రులక్షరములు మంగళ వాయిద్యాల మధ్య భక్తులు భక్తుశ్రద్ధలతో ఈ హెూమంలో పాల్గొన్నారు. ఈ హెూమం సకల విజయంనకు దోహదపడుతుందని వేద పండితులు తెలిపారు. హెూమం చేయడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెంది రైతాంగం ప్రజలు పిల్లాపాపలతో సంతోషంగా ఉంటూ రామానుగ్రహం పొందుతారని అన్నారు. శ్రీరామరక్ష సర్వ జగద్రక్ష అనే నానుడి ప్రకారం నిస్వార్థంగా చేస్తున్న ఈ సకల విజయం లకు ఆలవాలమైన ఈ హెూమం నిర్వహణను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన జర్నలిస్ట్ డి.రవిప్రసాద్



**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్:** పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి పట్టణ కేంద్రంలోని 18 వ వార్డు గాంధీనగర్ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డోర్ టు డోర్ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ని జర్నలిస్ట్ డి.రవిప్రసాద్ గాంధీనగర్ లోని తన నివాసంలో చిన్ననాటి క్లాస్మేట్ చీర్ల చందర్ తో కలిసి శాలువాతో చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్కాకుల సతీష్ ,డి.దేవదాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకు కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**గండీడ్ మేజర్‌న్యూస్:** సోమవారం గండీడ్ మండల కేంద్రంలో మహ్మదాబాద్ గండీడ్ మండలాల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన నేత ఆయన గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం చేసి బీసీ నేతను గెలిపించి పార్లమెంట్ కు పంపించే బాధ్యత మనందరిపై ఉన్నది అని అన్నారు. కార్యకర్తలు అధైర్య పడవద్దు అని ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెంట్యా నాయక్, మహ్మదాబాద్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బిక్షపతి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి,రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



**నవాబ్‌పేట మేజర్ న్యూస్:** పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా లింగం పల్లి గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీ చంద్ రెడ్డి గెలుపు కోసం చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కూలీలకు పనిచేసే దగ్గర నీటి,టెంట్ సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవ రెడ్డి బాల్ రెడ్డి రాములు జింకల రాములు కృష్ణయ్య అంజయ్య మాసయ్య ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

## పూర్తిగా రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొల్ల మాసయ్య తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మారేపల్లి సురేందర్ రెడ్డి, ఎంపిటిసి మునెమ్మ, మహేందర్, చెన్నయ్య, రామస్వామి గౌడ్, చిన్న యాదయ్య గౌడ్, భీమేష్, కేశవులు, ఖాదరయ్య, రవింధర్ గౌడ్, పి వెంకటేష్, మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : యస్.ఐ భాగ్యలక్ష్మి రెడ్డి



**మక్తల్, మేజర్ న్యూస్** జిల్లా యస్.పి యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మక్తల్ మండలంలోని దాసరి దొడ్డి గ్రామంలో యస్.ఐ భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం వారు ప్రజలకు పలు సామాజిక అంశాలపై మాటల ద్వారా పాటల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యస్.ఐ భాగ్యలక్ష్మి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలు అయినా గంజాయి, డ్రగ్స్, మద్యం, గుడుంబా, గుట్కాలు మొదలగు వాటికి దూరం గా ఉండాలని వాటి వల్ల ఆరోగ్యాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ధైర్యంగా ఎవరి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్ గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్య నాయక్, గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దీపాదాస్ మున్షీని సన్మానించిన ఎమ్మెల్యే యెన్నం



**మహబూబ్‌నగర్, మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షి ని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి పాల్గొన్నారు.

## రేపు మేడే కవి సమ్మేళనం

**పాలమూరు మేజర్ న్యూస్ :** ప్రపంచ కార్మికుల దినోత్సవం మరియు శ్రీ శ్రీ జయంతిని పురస్కరించుకొని మే1న తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నామని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ ఖాజామైనద్దీన్ కొప్పోలు యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళశాలలో బుధవారం సాయంత్రం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సాహితి కోశాధికారి ఎస్.శివశంకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథి, వక్తగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్ధన్, ఆత్మీయ అతిథులుగా ఆర్.రామ్‌రెడ్డి, విజేత వెంకట్ రెడ్డి, వల్లభాపురం జనార్ధన ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. మేడే లేదా శ్రీశ్రీ అంశంపై కవయిత్రులు కవులు కవితా హృదయులు అధిక సంఖ్యలో పాల్గొని కవితా గానం చేసి కార్యక్రమాన్ని విజయం వంతం చేయాలని వారు కోరారు.

## మరోసారి పట్టుబడిన ఫిల్టర్ ఇసుక టిప్పర్



**నవాబ్‌పేట మేజర్ న్యూస్:** రుద్రారం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై మహబూబ్నగర్ జిల్లా కేంద్రానికి ఫిల్టర్ ఇసుక తీసుకుని వెళ్తున్న టిప్పర్‌ను స్థానిక పోలీసులు హెడ్ కానిస్టేబుల్ సురేష్ బాబు, హెూం గార్డు శెట్టి నాయక్ లు అనుమతులు లేకుండా వెళ్తున్న టిప్పర్ ను గస్తీ తిరుగుతూ పట్టుకుని పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అభిషేక్ రెడ్డి టిప్పర్ యజమాని సత్యనారాయణ పై కేసు నమోదు చేసి తహశీల్దార్ కు బైండోవర్ చేసినట్లు మీడియా ద్వారా తెలిపారు. ఎస్సై అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ ఫిల్టర్ ఇసుక తయారు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ కట్టడాలకు. ప్రభుత్వ భవనాలు కట్టడాలకు సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక రీచ్‌లలో ఎలాంటి చాలానా కట్టకుండా ఉచితంగా తీసుకువెళ్ళే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది అని అన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుఉంటాయని సూచించారు.

## జిల్లా పోలీసు అబ్జర్వర్‌గా వచ్చిన డిఐజి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేటటౌన్ మేజర్ న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లాకు పోలీసు అబ్జర్వర్ గా వచ్చిన డిఐజి కాలు రామ్ రావత్ ని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం జిల్లా అధికారులను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పిలు లింగయ్య, మహేష్, నారాయణపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్, సిఐలు శివ శంకర్, రామ్ లాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రధాని కావాలని ప్రార్ధనలు చేసిన మైనార్టీ నేతలు



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధాని కావాలని రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ సయ్యద్ అఖ్తర్, వనపర్తి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అనీస్ మిర్యాల గూడ జాన్పాడు దర్గాను సందర్శించి ప్రార్ధనలు చేశారు. నాగర్ కర్నూల్ ఎంపీగా మల్లురవిని గెలిపించాలని, తద్వారా రాహుల్ ప్రధాని కావాలని ప్రార్థించా మని వారు తెలిపారు. కాంగ్రెస్ తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు అన్నారు.

## ఇస్రంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలోని ఇస్రంపల్లి గ్రామంలో శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి సూచన మేరకు, కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ అభ్యర్థి చెల్లా వంశీచంద్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ, ఇస్రంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెల్లా వంశీచంద్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్ల కృష్ణయ్య, ఎండి సలాం, కురువ మన్యం, ఎండి రసూల్ ,గొల్ల రాములు, వాకిటి కృష్ణయ్య, వెంకటరెడ్డి, బోయ రాములు, ఎండి బాబు, ఎండి మాలాంగ్ ,గొల్ల రాకేష్, మరియు యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



**ఐజ మేజర్ న్యూస్ :** సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మండల పరిధిలోని ఇడిగోని పల్లి గ్రామంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గ్రామంలో బీజేపీ కార్యకర్తలు, ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు ఈ సందర్భంగా వారు ప్రధాని నరేంద్ర మోడి పాలనలో సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికి, ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు గోపాల కృష్ణ సీనియర్ నాయకులు మేడికొండ భీమ్ సేన్ రావ్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ బీజేవైఎం నాయకులు బింగి దొడ్డి లక్ష్మణ్ ఇడిగోని పల్లి బీజేపీ కార్యకర్తలు నర్సింహులు ఉరుకుందు జయరాములు తిమ్మప్ప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బండలాగు పోటీలో విజేతలు

**గోపాలపేట మేజర్ న్యూస్:** గోపాలపేట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు జాతర పురస్కరించుకొని వృషభరాజలచే అంతర్రాష్ట్ర బండలాగు పోటీలు నిర్వహించారు గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పులగం త్రిశజ్ఞారెడ్డి జశ్విత రెడ్డిల ఎద్దులు 3000 అడుగులు లాగి మొదటి బహుమతి 70 వేల రూపాయలు గీత కార్మిక సంఘం అందజేశారు రెండవ బహుమతి నాగర్కర్నూల్ జిల్లా తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి చెందిన డాక్టర్ అఖిలేష్ రెడ్డి ఎద్దులు 200922 అడుగుల లాగి రెండవ బహుమతి 50 వేల రూపాయలు కనకదుర్గ వైన్స్ వారు అందజేశారు మూడో బహుమతి నంద్యాల జిల్లా గుండు మాన్ దీన్నే కు చెందిన రాంభూపాల్ రెడ్డి ఎద్దులు 2652 అడుగులు లాగి 30 వేల రూపాయలు జీతా కార్మిక సంఘం గోపాల్పేట అందజేశారు అదేవిధంగా నాలుగో బహుమతి బాపట్ల బిళ్ళకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎద్దులు 2322 అడుగులు లాగి 20000 వేలు మాజీ ఎంపీపీమంద ప్రభావతి సత్య శిలా రెడ్డి అందజేశారు ఐదో బహుమతి గద్వాల నిఖిల్ రాయుడు బ్రదర్స్ కి చెందిన ఎద్దులు 21 8 0 అడుగులు లాగి 15 వేల రూపాయలు ఆర్ఎస్ రెడ్డి అందజేశారు ఆరో బహుమతి నంద్యాల జిల్లా సీసం గుంతల గ్రామానికి చెందిన ఆళ్ల మందమోహన్ రెడ్డి ఎద్దులు 20 69 అడుగులు లాగి 10 వేల రూపాయలు వైసీపీ ఆర్ చంద్రశేఖర్ అందజేశారు న్యూ క్యాటగిరి విభాగానికి గంగన పాలెం ఉమారెడ్డి శ్రీవల్లి ఎద్దులు మొదటి బహుమతి 50 వేల రూపాయలు కటార్ కొండ గుంటి రంగస్వామి వైన్స్ అందజేశారు గద్వాల జిల్లా గొర్ల దొడ్డి కురువ కర్రెప్ప ఎద్దులు రెండో బహుమతి 30000 రూపాయలు జయరాం దండే వీరమల్లు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు మున్నూరు గ్రామం చెందిన వ్యక్తి అందజేశారు మూడో బహుమతి గద్వాల జిల్లా ఎం రామాంజనేయులు 20 వేల రూపాయలు రూపాయలు కీర్తిశేషులు పశువుల కొండ స్వామి జ్ఞాపకార్థం కుమారుడు పసుపుల మెకానిక్ శంకర్ అందజేశారు నాలుగో బహుమతి కర్నూలు జిల్లా యనగండ్ల జానకి రాయుడు ఎద్దులు 10000 రూపాయలు రామలింగేశ్వర స్వామి బూడిది బసప్ప స్వామి దేవాలయం భక్త బృందం అందజేశారు ఐదవ బహుమతి నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు గ్రామానికి చెందిన గుణముని సత్యమేవద్దులు 5000 రూపాయలు కీర్తిశేషులు శనగల బాలయ్య జ్ఞాపకార్థం కుమారుడు చనగల కొండయ్య అందజేశారు

# 28వ వార్డులలో గడప గడప ప్రచారం : మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్



**గద్వాల మేజర్ న్యూస్ :** గద్వాల పట్టణంలోని 28వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవి కీ మద్దతుగా జడ్పీచైర్ పర్సన్ గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య నాయకత్వంలో మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తూ వార్డ్ ప్రజలకు గ్యారెంటీ కార్డులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కేశవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఇచ్చినా హామీలను అమలు చేసి బాధ్యత డాక్టర్ మల్లురవి తీసుకుంటారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని హస్తం గుర్తుకు ఓటు వేసి వేయించి ప్రతి వార్డులలో భారీ మెజార్టీ తీసుకురావాలని వార్డ్ ప్రజలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యూసుఫ్ జాఫర్ రాజు భావ్ రమేష్ రాజేష్ గౌడ్ స్వామి పరుశ శేఖర్ మోహిన్ మరియు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఓటరు శోభాయాత్ర



### - కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఓటరు తన ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న స్వీప్ యాక్టివిటీ లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సబ్బండ వర్గాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, కవులు, కళాకారులతో వనపర్తి జిల్లాలో సాయంత్రం వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన మెగా ర్యాలీ అత్యంత విజయవంతంగా పూర్తి అయ్యింది. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం, ఇందిరా పార్కు ఇలా మూడు దిక్కుల నుండి వేలాదిగా తరలి వచ్చిన సబ్బండ వర్గాల ప్రజలు ప్లకార్డులు, మేము ఖచ్చితంగా ఓటు వేస్తాం అనే నినాదాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందుకు గుమికూడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ మే 13వ తేదీన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం రక్షణగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యం. నగేష్, స్వీప్ నోడల్ అధికారి రామ మహేశ్వర రెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.




**IN THE COURT OF MACT CUM IV ADDL DISTRICT JUDGE: MAHABUBNAGAR**

O.P No. 371 of 2023

Between:
Saida Begum and others …Petitioner
And
Mohd Hamed Ali and others …Respondent.

**NOTICE**

To,
Mohd Hamed Ali S/o Mohd Ameer Ali, Aged: Major, rider of Motor Cycle bearing no TS 06 FE 3161 R/o H No: 24-98, Madina Masid, Fazal Banda, Badepally, Jadcherla, Mahabubnagar

**.. Respondent No. 1**

Take notice that the above O.P filed for compensation under section 166 of M.V.Act, 1988 against you and another and it is posted on 24/05/2024 for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Court on 24/05/2024 at 10.30 AM the petition will be decided ex-party.

**"By the order of the Court"**

**G KARTHIK**
**B.Tech.,LL.B,**
**Advocate, H.No.7-4-5/2,**
**Venkateshwara colony,**
**Mahabubnagar.**

**IN THE COURT OF MACT CUM DISTRICT JUDGE: MAHABUBNAGAR**

O.P No. 288 of 2021

Between:
Aswini Pavan Kumar U/g of Dodla Jyothi …Petitioner
And
MA Khaliq and other …Respondent.

**NOTICE**

To,
Zubar Bag S/o Late Mirza Hassan Baig, Aged: Major, R/o H No: 7-3-34/E, Prem Nagar, Industrial Area, Mahabubnagar

**... Respondent No. 4**

Take notice that the above O.P filed for compensation under section 166 of M.V.Act, 1988 against you and another and it is posted on 08/05/2024 for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Court on 08/05/2024 at 10.30 AM the petition will be decided ex-party.

**"By the order of the Court"**

**G KARTHIK**
**B.Tech.,LL.B,**
**Advocate, H.No.7-4-5/2,**
**Venkateshwara colony,**
**Mahabubnagar.**

**IN THE COURT OF MACT CUM IV ADDL DISTRICT JUDGE: MAHABUBNAGAR**

O.P No. 222 of 2021

Between:
K Vinay U/g of K Manyam …Petitioner
And
Krishna and another ….Respondent

**NOTICE**

To,
M Somasekhar Reddy S/o M Dharma Reddy, Aged: Major, Owner of Motor Car bearing no TS 33 C 2277 R/o H No: 1-4-33/4J, Venkateshwara Colony, Gadwal Town, Jogulamba District

**.. Respondent No. 2**

Take notice that the above O.P filed for compensation under section 166 of M.V.Act, 1988 against you and another and it is posted on 24/05/2024 for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Court on 24/05/2024 at 10.30 AM the petition will be decided ex-party.

**"By the order of the Court"**

**G KARTHIK**
**B.Tech.,LL.B,**
**Advocate, H.No.7-4-5/2,**
**Venkateshwara colony,**
**Mahabubnagar.**

## కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల పుట్టపల్లి గ్రామంలో సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చేల్లా వంశీ చంద్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని పుట్టపల్లి గ్రామంలో పుట్టపల్లి నాయకులు ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. భారీ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చేల్లా వంశీ చంద్ రెడ్డిని గెలిపించాలంటూ వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలి



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలోని వెంకటగిరి గ్రామంలో సోమవారం బిజెపి నాయకులు లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఇంటింటికీ తిరిగి బిజెపికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల లను ప్రజలకు వివరిస్తూ, మహబూబ్నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగారపు కృష్ణారెడ్డి ,రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి ,దేవారెడ్డి ,వంశీ చారి, తిరుపతిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## మే డేను విజయవంతం చేయాలని ఐ.ఎఫ్.టి.యు కరపత్రాల పంపిణి



**నారాయణపేట టౌన్ మేజర్న్యూస్:** నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామంలో 138వ మేడేను విజయవంతం చేయాలని కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బి.నరసింహ ఐ.ఎఫ్.టి.యు జిల్లా కార్యదర్శి తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు వెంకటయ్య, కార్మికులు, భాస్కర్, రఘు, సాయిలు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక



**ధన్వాడ మేజర్ న్యూస్ :** ధన్వాడ మండలం, గున్ముక్ల గ్రామం బి ఆర్ యెస్ పార్టీ నుండి మాజీ సర్పంచ్ బాలయ్య గౌడ్, వార్డ్ మెంబర్ జె అశోక్ గౌడ్, మిగతా బి ఆర్ యస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## ఎస్సీ వర్గీకరణ మీద కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ ప్రకటించాలి




**పాలమూరు మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ మీద కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని ఎమ్మార్పీఎస్– ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్ర కంటి రాందాస్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేశారు. సామాజిక న్యాయంకోసం కట్టుబడి ఉన్నా మంటు ఎన్నికల ముందు ప్రచారం చేసిన పార్టీలు విస్మరించడం సిగ్గుచేటు అన్నారు. అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మాణాలు, కమీషన్లు, కమీటీల పేర్లతో మోసం చేయకుండా అన్ని పార్టీలు ఎస్సీ వర్గీకరణ పట్ల తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాజగాని అశోక్, యల్.రమేష్ మల్లెల అనిల్, తిర్మలయ్య, వినోద్, పద్మమ్మ, నరేందర్, రాజు, యాంకి రమేష్, రామకృష్ణ, పాల్గన్నారు.

# ఎన్నికల్లో అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటేయండి

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు వారంటీ లేని హామీలు ఇచ్చినది
- పదేళ్ల కెసిఆర్ పాలనలో అభివృద్ధి.. 100 రోజుల కాంగ్రెస్ పాలనలో కరువు
- శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులను పొందిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్







**ధరూర్ మేజర్ న్యూస్:** గద్వాల్ నియోజకవర్గంలో కె.టి దొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను పొందడం జరిగినది.నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కె.టిదొడ్డి మండలలో ఎన్నికల ప్రచారంలో ప్రారంభించడం జరిగినది.ఎమ్మెల్యేకి ఎంపీ అభ్యర్థికి ప్రజాప్రతినిధులు నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ లో సాధ్యం కానీ అభివృద్ధి కార్యక్రమాలు పదేళ్ల తెలంగాణ పాలనాల్లో కేసీఆర్ నాయకత్వంలో సాధ్యం కావడం జరిగింది. గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం కేసీఆర్ గారితోనే సాధ్యం కావడం జరిగింది. కెసిఆర్ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుండి అనేకమైన సంక్షేమ పథకాలను ఎలాంటి మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు కేసీఆర్ ఆని గర్వంగా చెప్పారు. గతంలో ఈ ప్రాంతంలోని రైతులు జీవనోపాధి కోసం కర్ణాటక మహారాష్ట్ర తమిళనాడు వంటి ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా పరిస్థితి ఉండేది. కెసిఆర్ పాలనలో రైతుల సంక్షేమం కోసం అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతులకు 24 గంటల కరెంటు సాగునీరు అందించి ప్రతి ఎకరానికి పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవడం జరిగింది. ఇప్పుడు మళ్లీ 100 రోజుల్లో కరువు ఏర్పడింది. నీళ్లు లేక కరెంటు లేక పంటలు ఎండిపోవడం పరిస్థితి వచ్చింది. రైతులకు ఎన్నికల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు 15000 ఇస్తాను ఇయ్యలేదు ఊరికి సబ్సిడీ 500 రూపాయలు ఇయ్యలేదు రైతులకు రైతు మూలం రుణమాఫీ రెండు లక్షల రూపాయలు ఇంతవరకు చేయలేదు. కాబట్టి రైతులు పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి కేసీఆర్ బలపరిచిన అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ నేను నడిగడ్డ వాసి పుట్టిన బిడ్డ పదేళ్లలో కెసిఆర్ పాలనలో గురుకులాల సంక్షేమం కోసం కేసీఆర్ గారి సహకారంతో కార్యదర్శిగా పనిచేసే పది లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తుని తీర్చిదిద్దడం జరిగింది. నేడు ఆ విద్యార్థులు అతుస్థాయిలో ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడ్డారు. భవిష్యత్తులో మీ పిల్లలు కూడా ఇదేవిధంగా మంచి ఉన్నత స్థాయికి స్థాయికి ఎదిగే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినది అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు 420 హామీలు వంద రోజుల్లో అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి ప్రజలకు మోసం చేసి అధికారం చేపట్టడం జరిగింది. ఇప్పటివరకు ఎలాంటి హామీ గ్యారెంటీలను అమలు చేయలేక పోయినది. కేవలం మాటలు తప్ప చేతలు లేని ప్రభుత్వంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నన్ను కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని ప్రలోభాలు పెట్టడం జరిగింది ఎన్నో ప్రభుత్వంలో అధికార పదవిలను ఇస్తామని మాటలు చెప్పడం జరిగింది. వాటన్నిని వాటిని కాదని కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మేలు జరుగుతుందని కెసిఆర్ సారథ్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా కెసిఆర్ ఆశీస్సులతో పోటీ చేయడం జరుగుతుంది కాబట్టి మీరందరూ ఒక్కసారి నన్ను ఆశీర్వదిస్తే నాగర్ కర్నూల్ లో గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కొరకు మీ తరఫున ప్రశ్నించే గొంతుగా నిలబడి గద్వాల నియోజకవర్గంలో ప్రపంచ చిత్రపటంలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని. విద్యారంగం అభివృద్ధి కొరకు రైతుల అభివృద్ధి కొరకు అన్ని వర్గాల సంక్షేమ అభివృద్ధి కొరకు ప్రతిరోజు కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే మే 13వ తేదీన జరగబోయే నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికలలో కారు గుర్తు పైన ఓటు వేసి అత్యధికమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడ జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, సత్యం రెడ్డి, శ్రీధర్ గౌడ్, చక్రధర్ రావు, ఎంపీపీలు మనోరమ్మ, ప్రతాప్ గౌడ్, రాజారెడ్డి, జెడ్పిటిసి లు రాజశేఖర్,పద్మ వెంకటేశ్వర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తాం – పిఎఫ్ నోడల్ అధికారి ప్రసాద్



**పాలమూరు మేజర్ న్యూస్ :** ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారుల సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కరించడమే మా ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ పీఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'నిధి ఆప్కే నిక్కట్ 2.0' కార్యక్రమంలో ఆయన పీఎఫ్ సభ్యుల సమస్యలను,సందేహాలను నివృత్తి చేసి మీడియాతో మాట్లాడారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతి నెల పీఎఫ్ పెన్షన్ దారుల చెల్లింపుల సమస్యలు,ఆన్ లైన్ క్లెయిమ్ ఫైల్ చేయడం, ఈకెవైసీ రిలేటెడ్ లింక్స్,సభ్యులు తమ ఖాతాలో నిల్వలు,ఈడిఎల్ఐ ఇన్సూరెన్స్,సభ్యత్వం వలన పొందే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు ఎ.రాజసింహుడు, మనోహర్, డేవిడ్, హౌసింగ్ కార్పొరేషన్ విశ్రాంత ఉద్యోగులు కొండయ్య, వెంకటయ్య, సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ టి.దీపన్ చక్రవర్తి,వెల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేటి నుండి గజేలేశ్వరి దేవి జాతర మహోత్సవాలు

**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బాపన్ పల్లి గ్రామంలో వెలసిన గజేలేశ్వరిదేవి జాతర మహోత్సవలు మంగళవారం నుండి ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు తెలిపారు మంగళవారం సాయంత్రం అమ్మవారికి ఏడు గ్రామాల నుండి భక్తులు కాలినడకన దాదాపుగా 5 నుండి 7 కిలోమీటర్ల దూరం గ్రామాలైన వత్తుగుండ్ల కృతన్‌పల్లి కందెన్ పల్లి తదితర గ్రామాల నుండి పెద్దమొత్తంలో అమ్మవారికి బోనాలుతో మేకలు కోళ్ళు నైవేద్యం సమర్పిస్తారుఇట్టి కార్యక్రమాలు మూడు రోజులు కోనసాగుతాయన్నారు

## సిపిఎం ఎన్నికల ప్రణాళిక విడుదల



**పాలమూరు మేజర్ న్యూస్ :** సిపిఐఎం ఎన్నికల మేనిఫెస్టోను సోమవారం సిపిఐ ఎం జిల్లా కార్యాలయంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఏ రాములు నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిజెపి పాలనలో అన్ని రకాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు,కూలీలు, పారిశ్రామిక కార్మికులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు అనేక పడ్డారన్నారు. రాజ్యాంగంలో కల్పించిన లౌకిక సూత్రాలకు విరుద్ధంగా పనిచేస్తున్న బిజెపిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు, రాజ్యాంగ రక్షణ,ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాల కోసం సిపిఎం పార్టీ పోరాడుతుందన్నారు. ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కురుమూర్తి, వి పద్మ, చంద్రకాంత్, కడియాల మోహన్, రాజ్ కుమార్, ప్రశాంత్ ,సురేష్, విజయ్ పాల్గొన్నారు

## అబా కార్డ్స్ ఎన్సీడీ పోర్టల్‌లో లింక్ చేయండి

### - ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి రాజు

**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** అబా కార్డ్స్ ఎన్సీడీ పోర్టల్ లో లింక్ చేయాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి రాజు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శశికళ ఆదేశాల మేరకు సోమవారం పాత డిఎంహెచ్ఓ కార్యాలయంలో గద్వాల అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉపేర్ ఏఎన్ఎం లకు ఎంఎల్హెచ్పి సిబ్బందికి , సూపర్వైజర్ క్యాడర్ వారికి ఎన్సిడి పై రివ్యూ నిర్వహించారు. ప్రతినెల ఫాలోప్ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ఎన్సిడి పోర్టల్ లో లింక్ చేసే విధానం పై అవగాహన కల్పించారు. ప్రతిరోజు అబా కార్డ్స్ లింక్ చేసిన తర్వాత సంఖ్యను జిల్లాకు తెలుపాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి రాజు తెలిపారు. అదేవిధంగా వారి యొక్క ట్యాబ్ లను ఆన్ చేసి ఒక్కొక్క ఏఎన్ఎం అబాకార్డుల ను లింక్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ శ్యాంసుందర్, మక్సూద్, డిడియం రామాంజనేయులు, కళ్యాణి హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్



**ఐజ మేజర్‌న్యూస్:** ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐజ అరోరా కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు అందుకుగాను జోగులాంబ జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ విద్యార్థులను అభినందించారు. ఆరో కాలేజీ విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో స్టేట్ సెకండ్ ర్యాంకు మరియు జిల్లా ఫస్ట్ ర్యాంక్ కే ఉదయ్ కుమార్ 992/1000 సాధించారు అలాగే యు లక్ష్మి 983/1000, యు భావన 980/1000, ఇంటర్ సెకండియర్ బైపీసీలో కే అఖిల 985/1000, కే భార్గవి 981/1000 సాధించగా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో జి దివ్య సుధ 464/470, కె. మనీషా 455/470, బి.కె.ఉమ శ్రీ 447/470, వి క్రిష్టో లైట్ 447/470 మరియు ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో యు వైష్ణవి 422/440 ఉత్తీర్ణతలు సాధించి ఔరా అనిపించారు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన ఆరోరా కాలేజీ విద్యార్థులను సోమవారం నోడల్ ఆఫీసర్ హృదయరాజు జిల్లా కేంద్రం కార్యాలయంలో శాలువాలు కప్పిసన్మానించారు. ఆరోరా కాలేజీ కరస్పాండెంట్ సుమన్, లెక్చరర్లు నరసింహ చారి, శ్రీనివాసులు, మధు బాబు, దానమయ్య లు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యం



**కృష్ణ మేజర్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే దేశం మరింత అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి నల్లే నర్సప్ప అన్నారు. పాలమూరు లోక్ సభ ఎన్నికల్లో భాగంగా బిజెపి ఎంపీ అభ్యర్థి డికే అరుణ మద్దతుగా సోమవారం మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజలకు మోదీ ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అమలు కానీ ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని ఈ లోక్ సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి వేయించి అరుణమ్మను భారీ మెజారిటీతో గెలిపించి మూడోసారి మోదీనీ ప్రధాన మంత్రి చేసి మన పాలమూరును అభివృద్ధి చేసుకుందమన్నారు. నారాయణ బట్,డీకే కిష్టప్ప, బూత్ అధ్యక్షులు రమేష్, శక్తి సింగ్, బీజేవైఎం నాయకులు సచిన్ బట్, మహేష్ ,హరీష్, నాయకులు కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రచారం



**గండీడ్ మేజర్ న్యూస్:** చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపు కోసం గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నచేడ్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేసి రంజిత్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని నిధులు తీసుకువచ్చే రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని,అన్ని గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యులు నరసింహారావు, నాయకులు అనంత లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,చిన్నయ్య, బాలయ్య, గోపాల్, ఆశన్న, బాలస్వామి, పులిందర్ రెడ్డి,టిక్యా నాయక్,కొట్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మైలారం గుట్టపై మైనింగ్ త్రవ్వకాలు అనుమతులను రద్దు చేయాలి

### - గుట్ట ముద్దు ఓటు వద్దు అంటూ గ్రామంలో వినూత్న రీతిలో నిరసన ర్యాలీ
### - పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తుల సంచలన నిర్ణయం





**లింగాల (బల్మూర్), మేజర్ న్యూస్:** పెద్ద ఎత్తున ఓటర్లను నమోదు చేయాలని, ఓటింగ్ శాతం పెంచాలని, శాంతియుతంగా, స్వేచ్ఛగా పోలింగ్ బూతులకు ఓటర్లు వచ్చి తమఓటు హక్కును వినియోగించుకో వాలంటూ ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఒక ప్రక్కన చెబుతుంటే తమ బతుకులను నాశనం చేసే గుట్టపై మైనింగ్ పనుల అనుమతులను రద్దు చేయాలని లేనట్లయితే వచ్చే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తామని నాగర్ కర్నూల్ జిల్లా, బల్మూరు మండలం, మైలారం గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం ఉమ్మడి పాలమూరు జిల్లాలో సంచలనం రేపింది. మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టపై మైనింగ్ త్రవ్వకాలకు సంబంధించిన అంశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం మైలారం గ్రామంలో గ్రామస్తులు సమావేశమై వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించేటకు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గుట్టపై త్రవ్వకాలకు అక్రమంగా ఇచ్చిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని మైలారం గ్రామంలోని ప్రధాన రహదారాలు గుండా వినూత్న రీతిలో నిరసన తెలుపుతూ సేవ్ మైలారం, గుట్ట ముద్దు ఓటు వద్దు అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా బయలుదేరి గ్రామంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుట్టపై మైనింగ్ త్రవ్వకాలు వద్దంటూ తాము ఎన్నిసార్లు జిల్లా అధికారులు, జిల్లా మైనింగ్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని వాపోయారు. గుట్టపై మైనింగ్ త్రవ్వకాల పనులు జరిగితే తమ జీవన వ్యవస్థ విధ్వాంసానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టపై పురాతనమైన దేవాలయాలు, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం డంపింగ్ యార్డులు ఉన్నాయని తెలిపారు. గుట్టపై త్రవ్వకాల వల్ల చెట్లు నాశనమై పర్యావరణానికి హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గుట్ట ప్రక్కనే గ్రామానికి జీవనాధారమైన ఊరం చెరువు ఉందని దీనిపై ఆధారపడి వేలాదిమంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గుట్టపై త్రవ్వకాలు జరిపితే తమ జీవితం సర్వ నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ పనులను ఆపకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికలను ఓటు వేయకుండా బహిష్కరించడానికి గ్రామస్తులు ముక్కుమ్మడిగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్టుపై మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారకపోతే శాంతియుతంగా తమ నిరసన, ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతంలో అనేకసార్లు మైనింగ్ త్రవ్వకాలను ఆపాలని అధికారులకు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందించామని ధర్నాలు చేపట్టిన ప్రయోజనం లేకుండా పోయిందని ప్రభుత్వాలు మారిన తమ సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడం వల్ల ఈ నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. గుట్టపై మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు తీసుకుని ఈ నిర్ణయాన్ని జిల్లా కలెక్టర్ కు తెలియపరచుతూ పార్టీలకతీతంగా గ్రామస్తులంతా కలిసి జిల్లా కలెక్టరేట్ కు వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు

## పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నీ అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం

### - బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డా.గువ్వల బాలరాజు



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ ఎంపీగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నీ గెలిపిద్దామని బిఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అచ్చంపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు కోరారు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం అచ్చంపేట పట్టణంలోని 12, 20వ వార్డులలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు, అభిమానులతో కలిసి ప్రచారం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని నేడు కాంగ్రెస్ పాలనలో ప్రజలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి మీ అందరి అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని కోరారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహా గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ శంకర్.పార్టీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు నాగరాజు. శివ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి - ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అమ్రాబాద్ గ్రామ సభ



**అమ్రాబాద్, మేజర్ న్యూస్:** ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఔట శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని త్రాగునీరు, కరెంట్, తదితర సమస్యలను ఎంపీటీసీలు దృష్టికి తెచ్చారు. వేసవి కాలం త్రాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా 3 కోట్ల రూ. గ్రాంట్ వచ్చిందని, త్రాగునీటి సమస్య తలెత్తకుండా స్పెషల్ ఆఫీసర్‌లు, సెక్రటరీలు కార్యాచరణ చేపట్టాలన్నారు. కరెంట్ అంతరాయం రాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నాటికి వ్యవసాయ రంగంపై ముందస్తు ప్రత్యేక దృష్టి పెట్టాలని, వేసవిలో సెలైన్ సప్లై తక్కువగా ఉందని వైద్య సిబ్బంది సూచించగా ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే సప్లై చేయాలన్నారు. లేడీ డాక్టర్ ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటిసి అనురాధ, వైస్ ఎంపిపి ప్రణీత, మిషన్ భగీరథ డిఈ హేమలత, మండల స్పెషల్ ఆఫీసర్ ఎడిఎ చంద్ర శేఖర్, ఎంపీడీఓ మోహన్ లాల్, పలు శాఖల అధికారులు, ఎంపీడీఓ లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిఐటియూ ఆధ్వర్యంలో మేడే కరపత్రాల విడుదల



**పాలమూరు మేజర్ న్యూస్ :** సిఐటియు ఆధ్వర్యంలో రూపొందించిన మే -డే కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలోని వాటర్ ఫిట్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, యూనియన్ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 138వ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు, పట్టణ మండల కేంద్రాలు, కార్మికవాడ, పారిశ్రామిక ప్రాంతాల్లో నిర్వహించాలన్నారు. ఎర్రజెండాలు ఎగురవేసి కార్మిక వర్గానికి మేడే విశిష్టతను వివరించాలని విజ్ఞప్తి చేశారు. అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గ పోరాట బలిదానంతో 138 సంవత్సరాల క్రితం 8 గంటల పని దినం కోసం అమెరికా దేశం చికాగో నగరంలో కార్మిక వర్గం విరోచితంగా పోరాటం చేసి సాధించుకున్న రోజు నుండి మేడే జరుపుకుంటున్న మన్నారు. మేడే కరపత్రాలు విడుదల చేసిన వారిలో ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముక్తారా?న్, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వరదగాలన్న, టైల్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి చంటి ,పెయింటర్స్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి సూరి, జాఫర్, నజీర్, సత్యం ,మోహన్రావు ,జాంగిర్, సుల్తాన్ పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మంగళవారం
30 ఏప్రిల్ 2024

## నివాళులు అర్పించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణ పరిదిలోని మర్రికుంట 9వ వార్డ్ లో చీర్ల ఆంజనేయులు గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరం జన్ రెడ్డి చీర్ల ఆంజనేయులు పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెంట మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, దేవర్ల నరసింహ, మర్రికుంట శ్రీను, చీర్ల శాంతయ్య, హనుమంతు, గోవర్ధన్, ప్రేమ్ సాగర్, బాబు నాయక్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** రేకులంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఎరుకలి సవరన్న అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకుని వారి కుటుంబానికి మనో ధైర్యం కల్పించి,పరామర్శించిన టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి ,మరియు రేకులం పల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన చీర్ల ఆంజనేయులు

### - ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** వనపర్తి పట్టణంలోని తొమ్మిదవ వార్డుకు చెందిన మాజీ ఆర్మీ జవాన్ చీర్ల ఆంజనేయులు గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యమిచ్చారు. చీర్ల ఆంజనేయులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి వెంట వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, స్థానిక కౌన్సిలర్ భాష నాయక్, కౌన్సిలర్ సత్యం, నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, చీర్ల ఆంజనేయులు, చీర్ల మన్యంకొండ, మోడల శివకుమార్, దేవేందర్, చీర్ల జనార్ధన్, అయ్యన్న, బాలకృష్ణ, శివకుమార్, నాయకులు , కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని పదవ వార్డు నాగవరం కు చెందిన నాయి బ్రాహ్మణ జిల్లా సంఘం మాజీ అధ్యక్షుడు అశ్విని సత్యం తల్లి అశ్విని పుల్లమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతూడి మేఘారెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కౌన్సిలర్ జయసుధ మధు గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, నాయి బ్రాహ్మణ జిల్లా సంఘం అధ్యక్షులు మోహన్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ముంబై మన్నెం కొండ, శేఖర్ రెడ్డి, నందిమల్ల చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు

## కేశవాపూర్‌లో కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం



**కోయిలకొండ మేజర్ న్యూస్:** కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీధర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మండలంలో ఉన్న కేశవా పూర్ గ్రామపంచాయతీలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నరేష్ చారి, మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశాఎట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో, రామకృష్ణ, రమేష్, నర్సింలు ,బాల్ చందర్ బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# నవ కల్పనల ఆధారంగా మత్స్య పరిశ్రమ ఉత్పాదకతకు ఉజ్వల భవిష్యత్తు

### - ఎన్టీఆర్ కళాశాలలో జల పుష్పాలపై జాతీయ సదస్సు




**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతదేశ స్థిరమైన అభివృద్ధి కోసం మత్స్య సాగు ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ లో ఆవిష్కరణలు అను అంశంపై ఒకరోజు జాతీయస్థాయి సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలమూరు యూనివర్సిటీ ఇన్చార్జి రిజిస్ట్రర్ ప్రొఫెసర్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి నేషనల్ సెమినార్ కు సంబంధించిన సావనీర్ ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 500 మిలియన్ల మంది ప్రజలు ఆర్థికంగా మత్స్య సంపదపై ఆధారపడి ఉన్నారు తీరప్రాంత చేపలు పెంపకం మరియు ఆక్వా కల్చర్ ప్రధాన ఆర్థిక కార్యకలాపాలు మరియు తీర ప్రాంత మానవ జనాభాలో ఎక్కువ మందికి ఉద్యోగాలు జీవనోపాధిని సృష్టిస్తాయి చేపలలో ప్రోటీన్లు పుష్కలంగా ఉండి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఆరోగ్య భారతం కోసం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సృష్టించడానికి గ్రామీణ ప్రాంతాల్లో రెండు ఎకరాలతో కోట్లు సంపాదించవచ్చు ఇంటిగ్రేటెడ్ ఫిషింగ్లో ఎగుమతి దిగుమతలతో పేదరిక నిర్మూలనకు అధిక తోడ్పాటు అందిస్తాయి అంటూ మత్స్య పరిశ్రమపై ఈ కళాశాలలో ఏర్పాటు చేసినటువంటి జాతీయస్థాయి వేదిక ద్వారా విద్యార్థులు సమాచారాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో మత్స్య పరిశ్రమపై అవగాహన కల్పించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన డి రాధా రోహిణి అసిస్టెంట్ డైరెక్టర్ మరియు జిల్లా మత్స్య పరిశ్రమ అధికారి మహబూబ్నగర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగం తర్వాత మత్స్య పరిశ్రమకే అధిక ప్రోత్సాహానిస్తుంది ఒకప్పుడు నీరు తక్కువగా ఉండే మహబూబ్నగర్ జిల్లాల్లో ఇప్పుడు ఎక్కువ ఎక్కడ చూసినా కాలువలు నదులు చెక్ డాంల ద్వారా పుష్కలమైన నీరు అందుబాటులో ఉంది అన్నారు. పూర్వకాలంలో చేపలు వచ్చేటప్పుడు మాత్రమే పట్టుకునే వారు కానీ ఇప్పుడు ప్రభుత్వం అత్యంత ఖర్చుతో కూడుకున్న ఉచితంగా ఇస్తుంది కావున ప్రజలు వీటిని సద్వినియోగ పరుచుకొని చేపలు వదలడం మాత్రమే కాదు వాటికి వ్యాధులు రాకుండా చూసుకొని అధిక దిగుబడిని పొందవచ్చు అంటూ తులుగా మీ కర్తవ్యం ఇలాంటి సెమినార్ల ద్వారా అవగాహన ఏర్పరచుకొని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో మత్స్య పరిశ్రమపై చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ ఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఈ సెమినార్లో స్టేట్ యూనివర్సిటీ యూనివర్సిటీస్ 127 అబ్స్ట్రాక్స్ అదేవిధంగా 32 ఫుల్ లెన్త్ పేపర్స్ రావడం జరిగిందని తెలుపుతూ ఈ జాతీయ సదస్సును తెలంగాణ ప్రభుత్వ మత్స్య పరిశ్రమ విభాగం మహబూబ్నగర్ వారి సమన్వయంతో నిర్వహిస్తున్నాం అంటూ మత్స్య పరిశ్రమ విభాగం చాలా పెద్దది కానీ మన దేశమంతా కర్షక వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తుంది. ఎన్నో లాభాలతో దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. నీటి కాలుష్యం వల్ల కూడా నది సముద్రాలు కలుషితం కావడం వల్ల జలచర జీవులు విలుప్తం అవుతున్నాయి .పెంచడమే కాదు రక్షణ కూడా అవసరం అంటూ తెలిపారు. ఈ సెమినార్లో టెక్నికల్ సెషన్స్ వన్ లో రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ ముత్తపకవి అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిషరీస్ కాలేజ్ ఆఫ్ సైన్స్ పెబ్బేర్ మత్స్య పరిశ్రమలు నూతన పోకడలు అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. టెక్నికల్ సెషన్ టూ లో రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ భాను ప్రకాష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సైన్స్ పెబ్బేర్ మత్స్య సాగు పద్ధతులపై ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెక్నికల్ సెషన్ 3లో రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఎం రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ జువాలజీ పాలమూరు యూనివర్సిటీ మత్స్య పరిశ్రమలో మార్కెటింగ్ మేనేజ్మెంట్ వంటి పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెక్నికల్ సెషన్ ఫోర్ లో రిసోర్స్ పర్సన్‌గా మోహన్ రెడ్డి ఫీల్డ్ ఆఫీసర్ మహబూబ్నగర్ మాట్లాడుతూ భారతదేశ సుస్థిరమైన అభివృద్ధి కోసం మత్స్యశాఖ అవలంబిస్తున్న ఆవిష్కరణలను విద్యార్థులకు వివరించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ భాను ప్రకాష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ, అవకాశాలు ఉన్న మత్స్య పరిశ్రమలో కొంత అవగాహన ఏర్పరుచుకుని పని చేస్తే అధిక లాభాలు సంపాదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, అమీనా ముంతాజ్, కోఆర్డినేటర్ డాక్టర్ టి విజయలక్ష్మి ,కోఆర్డినేటర్ ఆర్ లావణ్య ,కన్వీనర్ మరియు జంతుశాస్త్ర విభాగపతి జి స్వాతి, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి. హెచ్ శివప్రసాద్, వెంకటరమణమూర్తి, నసీం భాను, శ్రీలత, వర్ధిని ప్రియా, ఆసియా బేగం, నాగలింగం, టెక్నికల్ సపోర్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

## ఘనంగా టీజేఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** తెలంగాణ జన సమితి పార్టీ 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని గద్వాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీజేఎస్ జోగులాంబ గద్వాల జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్ పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సభండ ప్రజల పక్షాననిలబడి పోరాటం చేసే తెలంగాణ జన సమితి ఏకైక పార్టీ అని గత 5 సంవత్సరాలుగా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ధనమే కేంద్రంగా జరుగుతున్న నేటి రాజకీయాల్లో తెలంగాణ జన సమితి మాత్రం ప్రజలతో మమేకమై, ప్రజల సమస్యలను నిరంతరం రాజకీయ ఎజెండా మీద నిలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మీద అవిశ్రాంత పోరాటం చేసి.. భూనిర్వాసితుల పక్షాన పోరాడి వారికి ధైర్యంగా జన సమితి నిలబడిందన్నారు. ప్రజలు ఎదర్కొన్న అనేక సమస్యల మీద స్పందించి, వాటిని రాజకీయ ఎజెండా మీద నిలపడంలో జన సమితి ప్రధాన పాత్ర వహించిందన్నారు. ప్రత్యేకంగా నిరుద్యోగ సమస్య మీద లోతుగా అధ్యయనం చేసి అనేక సదస్సులు నిర్వహించి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన అంశంగా ఎజెండా మీద నిలిపిందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడగల ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి మాత్రమేనని, తమ స్వార్థం కోసం పార్టీ పేరు మార్చున్నవారు అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన తరువాత మళ్లీ ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ తో బ్రతకాలని చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో పైసల రాజకీయాలను అధిగమించి ప్రజా స్వామిక రాజకీయాలను ఎజెండా మీదికి తెచ్చేందుకు పార్టీ పోరాడుతుందన్నారు. తెలంగాణ జన సమితి నాయకులు అలంపూర్ ఇంచార్జి ఆర్ రామ్మోహన్, వీరభద్రప్ప, యువజన నాయకులు భాష, నందిన్నె వీరేష్ పాల్గొన్నారు.

## కవులు, రచయితలపైఎబివిపి దాడి హేయమైన చర్య -ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఖండన




**మహబూబ్‌నగర్ మేజర్‌న్యూస్:** సెక్యూలర్ రైటర్స్ ఫోరం సముహా రాష్ట్ర సదస్సు కాకతీయ విశ్వవిద్యాల యంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ఈ అనేక అంశాలపై చర్చలు జరుగుతున్న సందర్భంలో హాల్ లోపలికి ఎబివిపికి చెందిన వారు వెళ్ళి బ్యానర్ చింపి, సభను అడ్డుకోని డా: పసునూరి రవీందర్, ప్రొఫసర్ కాత్యాయని, నరేష్ కుమార్ షూపీ, మెర్సి మార్గరెట్, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పై దాడి చేశారు. ఈ దాడిని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ సోమవారం మాట్లాడుతూ, దాడి చేసిన ఏబీవీపి నాయకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.దాడి చేయడమే కాదు అక్కడ ఉన్న మహిళలపై అనుచీతంగా వ్యవరించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యూనివర్శిటీలో విద్యార్థి సంఘం పేరుతో ఎబివిపి ఆరాచాకాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా యూనివర్శిటీలలో అకడమిక్ వాతావరణం, భావప్రకటనను హరించే చర్యలకు పాల్పడుతున్నారు.సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి, నిన్న హెచ్.సి.యు.లో గంజాయి, మద్యం మత్తులో విద్యార్థులపై దాడి నేడు వరంగల్‌లో కవులు, రచయితలపై దాడి చేయడం హేయమైన చర్య. రచయితలు, కవుల మీద భౌతిక దాడులు చేయడాన్ని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలని ఎస్ఎఫ్ఐ నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో నందు శ్రీనాథ్ సాయి దాస్తప్ప జఫర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ ఫిర్యాదులను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్ :** సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 05 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సీఐ, ఎస్ఐ లకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు

## యువత క్రీడా పోటీల్లో రాణించాలి

### - ఆకాంక్ష ఫౌండేషన్ సోదరులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రసన్నా రెడ్డి



**ధన్వాడ మేజర్‌న్యూస్:** గున్ముక్ల గ్రామానికి చెందిన సోదరులు ప్రవీణ్ కుమార్ రెడ్డి .ప్రసన్నారెడ్డి తాము స్థాపించిన ఆకాంక్ష ఫౌండేషన్ తరపున నిర్వహించినటువంటి గ్రామీణ క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రీమియర్ లీగ్ లో భాగంగా మొదటి బహుమతి అనిల్ ఎలెవెన్ టీం విజేతగా నిలిచింది. రెండవ విజేతగా బజరంగ్ సూపర్ కింగ్స్ నిలిచింది. ఈ టోర్నమెంట్లో మొత్తం ఎనిమిది టీములు పాల్గొనగా ఆకాంక్ష ఫౌండేషన్ నుంచి ప్రతి ఒక టీం క్రీడాకారునికి క్రీడ సామాగ్రి టీ షర్ట్ లు అందించడం జరిగింది. మొదటి బహుమతిగా 21000 రూపాయలు రెండవ బహుమతిగా 11000 వేల రూపాయలు నగదు బహుమతి తో పాటు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సోదరులు ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో యువత క్రీడా పోటీల్లో రాణించి పుట్టిన ఊరుకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. క్రీడాలో గెలుపు ఓటములు సహజమని ఓటమి నుంచి స్ఫూర్తిని పొంది ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పెద్దలు పాల్గొనడం జరిగింది.

## ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అనుమతించిన బిజెపికి తగిన బుద్ధి చెప్పాలి



**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండలంలో వా యు జల కాలుష్యం వెదజ ల్లుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతు న్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన బీజేపీ కి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కన్మనూర్ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగముగా విత్తనాలు కంపెనీ బాధిత గ్రామాల ప్రజలు కంపెనీని ఎత్తివేయాలని వంశీచంద్ర రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వంశీచం ద్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుకు అనుమతినిచింది భారతీయ జనతా పార్టీ, దానికి సహకరించిన బిఆర్ఎస్ పార్టీలని, ప్రజల పక్షాన పోరాడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ నేనని గుర్తు చేశారు. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్లో బిజెపికి ఓటు ద్వారా బుద్ధి చెప్పి, కాంగ్రెస్ ను ఆదరించాల ని అన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలలో గెలిచినా ఓడిన మీ గ్రామానికి వచ్చి మీతో కలిసి కంపెనీని రద్దు చేయాలని నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమని మాటిచ్చారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జలంధర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎర్ర దామోదర్ రెడ్డి, విజయ రెడ్డి, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి మండల కేంద్రంలో బిజెపిముమ్మర ప్రచారం



**ఎర్రవల్లిమేజర్ న్యూస్** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో సోమవారం బిజెపి ముమ్మర ప్రచారం కొనసాగింది ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు రామచంద్ర రెడ్డీ అసంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమల్ రెడ్డి జలగిరి అశోక్ మండలం ఇంచార్జి రాజగోపాల్ రావడం జరిగింది కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీజీ గారు చేస్తున్న అభివృద్ధి గురించి. గ్రామాల అభివృద్ధి దేశ సరి హద్దు ల ఎలాంటి బూంబు దాడులు లేకుండ చేస్తున్న నరేంద్ర మోడీజీకి ఓటు వేయాలి అని చెప్పడం జరిగింది నాగర్ కర్నూలు అభ్యర్థి భరత్ ప్రసాద్ కి ఓటు వేసి వే ఇంచాలి చెప్పడం జరిగింది జిల్లా నాయకులు సంపత్ మాణిక్య మండలం అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి ఉప అధ్యక్షులు శివ రామ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి అశోక్ రామకృష్ణ గోవర్ధన్ జనార్దన్ మహేష్ మండలం నాయకులు పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

## ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు



**వనపర్తి రూరల్, మేజర్‌న్యూస్ :** వనపర్తి మండల పరిధిలోని మెంటేపల్లి గ్రామంలో మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ ను ఎంపీ గా గెలిపించాలని బిఆర్ఎస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ మాట్లాడుతూ... ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ అధికారిగా ప్రభుత్వ సర్వీసులో వృత్తికే వన్నె తెచ్చి మంచి అధికారిగా ప్రశంసలు అందుకొని మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఆశీస్సులతో రెసిడెన్షియల్ పాఠశాలలో దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ఆర్.యస్ ప్రవీణ్ కుమార్ దేనన్నారు.పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని మన ముందుకు వస్తున్న ఆర్.యస్ ప్రవీణ్ కుమార్ ను ఆశీర్వదించాలని కోరారు. గతములో బి.ఆర్.యస్ పార్టీ ద్వారా ఎం.పి అయి పార్టీకి ద్రోహం చేసి మళ్లీ మన ముందుకు వస్తున్న పి.రాములు భరత్ లకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. 5ఏండ్లు ఎం.పి గా వుండి కేవలం ఆరు ప్రశ్నలు అడిగిన పి.రాములు కుమారుడు 600 ప్రశ్నలు అడిగి మన ప్రాంత అభివృద్ధికి తోడ్పడతారా ఆలోచన చేయండి అని అన్నారు. వలస జీవి, పైరవికారు అయిన మల్లు రవి గతములో ఎం.పి గా రెండు సార్లు పని చేసి ఒక్క అభివృద్ధి ప్రాజెక్టు అయినా సాధించాడా అని ప్రశ్నించారు. కేవలం ఢిల్లీలో పైరవీలు చేస్తూ నాయకులను లాబింగ్ చేస్తూ తెలంగాణ ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిన మల్లు రవి వల్ల మనకు లాభం ఉండదని అన్నారు.విద్యావంతుడు మన ప్రాంత సమస్యల పట్ల అవగాహన ఉన్న ప్రవీణ్ కుమార్ ను ఆశీర్వదించాలని కోరారు.ప్రజల గొంతుకై మన కోసం మన పిల్లల భవిష్యత్తు కోసం పార్లమెంట్‌లో పోరాడుతారన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కే మాణిక్యం, దేవర్ల నర్సింహా, మాధవరెడ్డి, చిట్యాల రాము, గ్రామ బిఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆకాష్ ఆనంద్ పై తప్పుడు కేసు బనాయించిన బీజేపీ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు



**ఎర్రవల్లి మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఉత్తర ప్రదేశ్ లో బహుజన్ సమాజ్ పార్టీ కేంద్ర సమన్వయకర్త ఆకాష్ ఆనంద్ ప్రసంగాలకు ఆదరణ పెరిగి ప్రజలు బీఎస్పీ వైపుకు మళ్లడంతో ఆయనపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులను బనాయించిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఆకేపోగు రాంబాబు అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమైన అనంతరం ఆయన మాట్లాడారు. ఆకాష్ ఆనంద్ ప్రసంగాలకు రోజురోజుకు ఆదరణ పెరిగి పార్టీ పటిష్టమవడంతో సహించలేని అక్కడి ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేయించిందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఆదరణ పెరగడంతో జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. ఆకాష్ ఆనంద్ ప్రసంగాలకు ఎన్డీఏ కూటమితో పాటు ఇండి కూటమికి కూడా బీటలు వారుతున్నాయని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలకు ప్రజలు విపరీతంగా తరలి వెళుతున్నారని.. దీనిని జీర్ణించుకోలేక పాలకులు తప్పుడు కేసులను బనాయిస్తున్నారని అన్నారు.బీఎస్పీ అధినేత్రి మాయావతి, కేంద్ర సమన్వయకర్త ఆకాష్ ఆనంద్ ప్రసంగాలు అక్కడి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని అన్నారు. జనాధారణ పెరగడంతో అసూయ వెళ్ళగకుతున్నారని అన్నారు. ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా రెండు కూటములను ఓడించి అధికారంలోకి రావడమే బహుజన్ సమాజ్ పార్టీ లక్ష్యం అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ కింగ్ మేకర్ గా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వెంకటేష్ నాయక్, గద్వాల నియోజకవర్గ ఇన్చార్జ్ బండారి ఎస్ రాజు, గద్వాల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సవరన్న, ఎర్రవల్లి మండల ప్రధాన కార్యదర్శి సంధ్య పోగు ఉపేంద్ర, ఆకే పోగు బీసన్న, సికిందర్ లు ఉన్నారు.

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా ఉప .వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె సిద్ధప్ప



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లాలో రోజురోజుకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప .వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె సిద్ధప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వ్యక్తి ప్రతిరోజు దాహం కాకున్నా ఎక్కువగా నీరు తాగాలన్నారు. ఒక ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ పౌడర్ ని ఒక లీటర్ నీటిలో కలిపి అవసరమైనంతవరకు తాగాలన్నారు. అదేవిధంగా దాహం అయినచో కొబ్బరి నీళ్లు, నిమ్మకాయ నీళ్లు, మజ్జిగ లేదా లస్సి, ఫ్రూట్ జ్యూస్ తాగాలన్నారు. బయటికి ప్రయాణం చేసినచో తప్పనిసరిగా వాటర్ బాటిల్ ని వెంట తీసుకెళ్లాలన్నారు. కాలానుగుణంగా అందుబాటులో ఉండే పండ్లు ,కూరగాయలు తినాలని, ముఖ్యంగా వాటర్ మిలన్ , మస్క్ మిలన్ ,ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్ ,దోసకాయ మొదలగునవి తినాలన్నారు. అవసరమైతేనే పనులు ఉంటేనే బయటికి వెళ్లాలి, అదేవిధంగా సాధ్యమైనంత వరకు ఉదయం కానీ సాయంత్రం కానీ బయటికి వెళ్లాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు టోపీ పెట్టుకొని , లేదా టవల్ తో తలపాగా ధరించి వెళ్లాలి లేదా గొడుగు వెంట తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు లేదా బూట్లు ధరించి వెళ్లాలన్నారు. ఏ వ్యక్తికైనా వడదెబ్బ లక్షణాలు ఉన్నచో సాధ్యమైనంత తొందరగా దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వెళ్లి చికిత్స చేసుకోవాలన్నారు.

## మరోసారి ఫలించని బీడీ కూలి పెంపు చర్చలు



**చిన్నచింతకుంట, మేజర్‌న్యూస్:** బీడీ కూలి పెంపు పై బీడీ యజమాన్యాలతో చర్చలు సఫలం కాలేదు.తాజాగా రెండోసారి హైదరాబాదులోని మల్లేపల్లి లోని బీడీ యజమాని బషీర్ సెట్ ఆఫీస్ లో బీడీ యాజమాన్యాలతో కార్మిక సంఘాల నేతలు చర్చలు జరిగాయి. 1000 బీడీలకు పాత కూలి పై పది రూపాయలు పెంచుతామని వస్తాద్ బీడీ యజమాని మహమ్మద్ సోయల్ సెట్ చెప్పడంతో కార్మిక సంఘాలు అంగీకరించలేదు. రెడ్డిబీడీయజమాని విష్ణువర్ధన్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో బీడీ కూలి పెంపుపై వచ్చే నెల ఎనిమిది లేక 9వ తేదీలో మరో మారు చర్చలు జరుపుతామని బీడీ యజమాని సుధాకర్ రెడ్డి చెప్పడంతో చర్చలు మళ్ళీ వాయిదా పడ్డాయి.బీడీ కూలి పెంపు చర్చలు వాయిదా పడడంపై కార్మిక సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు .ఈ చర్చలలో యాజమాన్యాలు వసీం సెట్, జియా సెట్, ఫజల్ అహ్మద్, అకిఫ్ సెట్, వజీర్ బాబు లతోపాటు ఐఎఫ్టియు నాయకులు కే సూర్య ,జె ఎన్ దేవదానం, కోళ్ల వెంకటన్న, ఏ సామ్యూల్, సిఐటియు నాయకులు బి వేణుగోపాల్, ఏఐటీయూసీ రాబర్ట్, మోసే వెంకటేష్, టిఎఫ్టియు నాయకులు యాదగిరి, ఖలీల్ శ్రీనివాసరావు, ఐఎన్టీయూసీ ప్రభుదాస్, పెద్ద బాలరాజు, టిఆర్ఎస్ కే వి నుంచి అబ్రహం నాయకులు చర్చలలో పాల్గొన్నారు.

## భరత్ ప్రసాద్ ను భారీ మెజారిటీతో గెలుపించుకుందాం - బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షులు బచ్చు రాము



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షులు బచ్చు రాము పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వార్డులలో సోమవారం బిజెపి పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి ఉదృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమానికి జిల్లా బిజెపి అధ్యక్షుడు డి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలోని నరేంద్ర మోడీ నాలుగో స్థానాన్ని తెచ్చిన ఘనత నరేంద్ర మోడీదేనని, చంద్రయాన్ త్రీ సక్సెస్ చేసిన ఘనత నరేంద్ర మోడీకి దక్కిందన్నారు. భారతదేశంలో చొరబాటుదారులు ,టెర్రరిస్టులు చొరబడడం చాలా తక్కువ అయిందని, భారతదేశంలో నరేంద్ర మోడీ పేరు చెప్పగానే టెర్రరిస్టులు పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చాడని, వనపర్తి నియోజకవర్గం నుండి బిజెపి పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్ కు భారీ మెజారిటీ ఇద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయక అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని అన్నారు. ఇంకోసారి ప్రజలు మోసపోకుండా కాంగ్రెస్ పార్టీ కి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఓబిసి అధికార ప్రతినిధి బి. శ్రీశైలం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, వనపర్తి పట్టణ బిజెవైఎం అధ్యక్షులు ఎద్దుల రాజు, బిజెపి సీనియర్ నాయకులు సుమిత్రమ్మ, ఎద్దుల రవి, రాయన్న సాగర్, బాలస్వామి, రాము, సామెల్, సుబ్రహ్మణ్యం, పికిలి వెంకటేష్, బొడ్డుపల్లి వెంకటేష్, ఎర్ర రవి, బూతు అధ్యక్షులు శ్రీనివాసులు, నరేష్, బాలరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యాండ్లూమ్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్ :** జాతీయ సంత్ కబీర్ మరియు నేషనల్ హ్యాండ్లూమ్ అవార్డు 2023 సం.నకు గాను రాష్ట్ర ప్రభుత్వం మరియు చేనేత జౌళి శాఖ దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, డిజైన్ లో నైపుణ్యం కనబరిచిన వారు మరియు చేనేత రంగంలో విశిష్ట సేవలందించిన చేనేత కళాకారులకు ప్రతిష్టాత్మక సంత్ కబీర్ మరియు నేషనల్ హ్యాండ్లూమ్ అవార్డు-2023 ఇవ్వబడునని, ఆసక్తి కల అభ్యర్థులు మే, 20 లోపు ఆఫీస్ వెబ్సైట్ లో నమోదు చేసుకోవాలని అట్టి దరఖాస్తును హైదరాబాదులోని వీవర్స్ సర్వీస్ సెంటర్ బి1 , బి2 లో మూడు ప్రతులను అందజేయాలన్నారు. ఇతర వివరముల కొరకు జిల్లా సహాయ సంచాలకులు, చేనేత మరియు జౌళి శాఖ కార్యాలయంను సంప్రదించగలరని తెలిపారు.

## నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు

### - కలెక్టర్ పి .ఉదయ్ కుమార్

**నాగర్‌కర్నూల్, మేజర్‌న్యూస్:** ఇద్దరు(02) ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహారణ, పార్లమెంట్ నియోజక వర్గం ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు, పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, ఉదయ కుమార్, నాగర్‌కర్నూల్ 12(%ాజ%) పార్లమెంట్ నియోజవర్గం అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించిన వారిలో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం రిటైనింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఉదయ కుమార్, తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల ఉపసంహరణ ఏప్రిల్ 29 రోజున 21 మంది అభ్యర్థులలో 02 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల బరిలో 19 మంది ఉన్నారని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లకు సమావేశం

### - సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలి : డీఐఈఓ



**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్ న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లకు సమావేశం నిర్వహించారు. ఇంటర్ కళాశాలల్లో ఫలితాల పెంపు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ, ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కళాశాలల్లో ఫీజుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీలోగా పరీక్ష ఫీజులు చెల్లించాలని అన్నారు. ఇంటర్మీడియేట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు కళాశాలల్లో ఉత్తీర్ణత పెంపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఒకటి లేదా రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులకు తగు రీతిలో తరగతులు నిర్వహించాలని అన్నారు. ఫెయిలైన విద్యార్థులతో పాటు ఇంప్రూవ్ మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా ఫీజులు చెల్లించాలని అన్నారు. వచ్చే నెల 24 నుండి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 15 కళాశాలల ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఖోఖో శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : పిఈటి బి.రూప



**మక్తల్,మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో మే 1 నుండి 30 వరకు మక్తల్ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని గ్రామంలో 16 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఖోఖో ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఈనెల మే 1న బుధవారము ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహణ కార్యదర్శి ఖోఖో ఎన్ఐఎస్, పిఈటిబి. రూప సోమవారము విలేకరుల సమావేశంలో తెలిపారు. కర్ని పరిసర ప్రాంతాలలోని బాలబాలికలు ఖోఖో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాల బాలికలకు ఖో ఖో క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇచ్చి ,గ్రామీణ ప్రాంతాలలోని క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసి, రాష్ట్ర ,జాతీయస్థాయి క్రీడలకు పంపుతామని బి.రూప తెలిపారు.

## కాంగ్రెస్-బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలంటే..

# పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

- గట్టులో జోగులాంబ దేవి యూనివర్సిటీని ఏర్పాటు ఆవశ్యం
- బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్
- సంక్షేమ పథకాలను పాతరేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి





**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** గద్వాల నియోజకవర్గంని లో గట్టు మండల కేంద్రములో నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థికి ఎంపీపీ, గట్టు మండల పార్టీ అధ్యక్షుడు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో ప్రతి గ్రామంలో ప్రభుత్వం నుండి అనేకమైన సంక్షేమ పథకాలను ఎలాంటి మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించిన నాయకుడు కేసీఆర్ అని గర్వంగా చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని నేటికి ఏ ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదన్నారు. ఇలాంటి ఎన్నో మాయ మాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టుకున్నదన్నారు. బిజెపి పార్టీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తూ కుల మతాల పేరుతో ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో చిచ్చులు పెడుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని, కేసీఆర్ బలపరిచిన అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ మే 13న జరగబోయే నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికలలో ప్రజలందరూ కారు గుర్తు పైన ఓటు వేసి అత్యధికమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడ, జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, హనుమంతు నాయుడు, ఎంపీపీ విజయ్, జెడ్పిటిసి లు రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, పిఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్, బిఆర్ఎస్ గట్టు మండల అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, కె.టి దొడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గద్వాల తిమ్మప్ప, ఆలూరు రామయ్య శెట్టి, రాధాకృష్ణారెడ్డి, అంగడి బస్వరాజ్, బజారి, రాముడు, రామకృష్ణ నాయుడు, యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సిసికుంట సర్వసభ్య సమావేశం



**చిన్నచింతకుంట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం సర్వసభ్య సమావేశం ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మహిళ సమైక్య సమావేశం హాల్ లో జరిగింది ఈ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికను సభలో చదివి వినిపించారు. ముఖ్యంగా వేసవి ఎండలు తీవ్రం అవుతున్న దృశ్య గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి సూచించారు. ప్రత్యేక అధికారులు పంచాయతీ సెక్రటరీలు ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి,వైస్ ఎంపీపీ సుమతి.రమేష్, తహసిల్దార్ సి.కృష్ణయ్య ఎం ఈ ఓ లక్ష్మణ్ సింగ్, ఎంపీ ఓ .అనిల్ కుమార్ పంచాయతి రాజ్ ఏఇ కురుమూర్తి, కో ఆప్షన్ మహిముద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రఘు. ఎంపీటీసీలు మనోహర్ రెడ్డి, లక్ష్మణ్. శ్రీదేవి. ఎంపీడీవో కార్యాలయ సూపర్డెంట్ మోసిన్. సీనియర్ అసిస్టెంట్. మద్దిలేటి. జూనియర్ అసిస్టెంట్. వెంకట్ రాములు పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గర్భిణీలకు బాలింతలకు మజ్జిగ పంపిణీ



**చిన్న చింతకుంట, మేజర్‌న్యూస్:** వేసవి కాలము ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ దవఖాన ఆవరణలో మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్.ఆర్.శ్యాంసోన్ ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి గర్భిణీ స్త్రీలకుబాలింతలకు రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వేసవికాలం దృష్టిలో ఉంచుకొని గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రోగులకు మజ్జిగను పంపిణీ చేసిన మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్.ఆర్శ్యాంసన్‌ను ఆమె అభినందించారు యువత సామాజిక సేవలో ముందుండాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అప్పంపల్లి.విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, కోఆప్షన్ మహమూద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజి బాలరాజ్, శేఖర్ ,ప్రతాప్, రహమత్, శ్రవణ్ ,ప్రవీణ్, విజయ్, గజ్జల రాజు.జి.రాజు ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

నాగర్‌కర్నూల్ జిల్లా : నాగర్‌కర్నూల్ టౌన్, అచ్చంపేట, టౌన్, రూరల్, చారగొండ, బల్మూర్, అమ్రాబాద్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, తాడూరు, పదర, ఉప్పునుంతల

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
9059897456,
9440126456